తల్లీబిడ్డకు రక్షణ పీఎంఎంవీవై

- పథకం కింద రూ.5వేల సాయం
- రెండు విడతల్లో చెల్లింపు

బలిజిపేట: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం(పీఎంఎంవీవై) మాతా శిశు సంరక్షణకు దోహదపడుతోంది. పేద, మధ్యతరగతికి చెందిన గర్భిణులకు ఈ పథకం ప్రయోజనకరంగా ఉంది. ఈ పథకాన్ని 2010లో అప్పటి కేంద్రప్రభుత్వం ఇందిరాగాంధీ మాతృత్వ సహయోగ్ యోజన(ఐజీఎంఎస్‌వై) పథకంగా ప్రారంభించారు. ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తరువాత 2016లో ఆ పథకం పేరును ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజనగా మార్పుచేశారు. ఈ పథకంలో మరింత మందికి లబ్ధిచేకూరాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. పథకాన్ని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి మరిన్ని మార్పులు చేసిన తర్వాత అమల్లోకి తీసుకువచ్చింది. పీఎంఎంవీవై ద్వారా అందించే నగదు ప్రోత్సాహకాల ద్వారా గర్భిణులు, బాలింతల్లో మెరుగైన ఆరోగ్య కల్పనకు నవజాత శిశుసంరక్షణకు, వ్యధల నివారణకు ఉపయోగపడుతుంది. ఈ పథకాన్ని గర్భిణులకు వర్తింపజేసే విధంగా ఆరోగ్య సిబ్బంది నమోదు ప్రక్రియను నిరంతరం నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణులను గుర్తించి వైద్యశాఖ రికార్డుల్లో పొందుపరుస్తున్నారు.



పథకానికి కావలసిన అర్హతలు:

- గర్భం దాల్చిన మూడు నెలల్లోపు పీఎంఎంవీవై పథకం కోసం వార్డు, గ్రామ సచివాలయంలోని వెల్‌నెస్ సెంటర్‌లో పేరు నమోదు చేయించుకోవాలి.
- గర్భిణులు తప్పనిసరిగా మదర్ చైల్డ్ ప్రొటెక్షన్(ఎంసీపీ)కార్డు కలిగి ఉండాలి.
- 19సంవత్సరాలు నిండిన తర్వాత గర్భం దాల్చిన మహిళలకు ఈ పథకం వర్తిస్తుంది.
- పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతినెలా 9న నిర్వహిస్తున్న పీఎంఎంవీవై శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలి.

దీంతో పాటు గత మూడేళ్లుగా నమోదు చేసుకోని చిన్నారుల తల్లులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. దీంతో ఈ పథకం ద్వారా లబ్ధిపొందే మహిళల సంఖ్య ఏటా పెరుగుతోంది.

నగదు చెల్లింపు ఇలా

- గర్భం దాల్చిన నాటినుంచి ప్రసవం పూర్తయిన తరువాత వరకు ఈ పథకం కింద రూ.5వేలు అందుతాయి.
- మొదటి విడతగా అంగన్వాడీ కేంద్రం లేదా గ్రామ సచివాలయంలో గర్భిణిగా నమోదైన తరువాత వైద్య పరీక్షల అనంతరం రూ.3వేలు అందజేస్తారు.
- గర్భిణి ప్రసవించిన తర్వాత ఒక వ్యాక్సిన్ వేశాక మిగిలిన రూ.2వేలు అందిస్తారు.



బలిజిపేట పీహెచ్‌సీకి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రప్రభుత్వం నవజాత శిశువులు, తల్లుల సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన పీఎంఎంవీవై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గర్భం దాల్చిన ప్రతి ఒక్కరూ వారి వివరాలను నమోదు చేసుకుని పథకం లబ్ధిని పొందాలి.

– క్రాంతి కిరణ్మయి, వైద్యాధికారిణి, బలిజిపేట పీహెచ్‌సీ

క్లుప్తంగా

లచ్చయ్యపేటకు తీరిన తాగునీటి సమస్య



ఎంపీపీ స్కూల్ ఆవరణలో ఉన్న వాటర్‌ట్యాంక్

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో మంచినీటి సమస్య నివారణకు ఏఈ ఆర్ పవన్‌కుమార్ పర్యవేక్షణలో సత్వర చర్యలు చేపట్టామని సర్పంచ్ సీహెచ్ కృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం సర్పంచ్‌తో పాటు మహిళలు మాట్లాడుతూ గ్రామ శివారులో ఉన్న మంచినీటి పథకం(ఓవర్ హెడ్ ట్యాంక్) ద్వారా నిరంతరం ప్రజలకు వాడుకనీరు, పాఠశాల ఆవరణలో జల్‌జీవన్ మిషన్ పథకం, పంచాయతీ నిధులతో నిర్మించిన మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా జరుగుతున్నట్లు తెలియజేశారు.

నిబంధనలు పాటించాలి



వాహన చోదకులకు సూచనలు చేస్తున్న పోలీస్‌సిబ్బంది

పార్వతీపురం రూరల్: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై పార్వతీపురం రూరల్ పోలీసుల నేతృత్వంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన దారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వరాదని, సరైన నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాన్ని నడపరాదని వాహనచోదకులకు అవగాహన కల్పించారు. విధిగా హెల్మెట్ ధరించాలని, వారి వాహనాలకు ఉన్న బకాయి చలానాలను చెల్లించాలని కోరారు. ఈ తనిఖీల్లో ఇటీవల శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ట్రైనింగ్ ఎస్సైలు, రూరల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల పరిశీలన



పెదబొండపల్లిలో ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఉపాధిహామీ పథకం కౌన్సిల్ మెంబర్ లావణ్యకుమార్

పార్వతీపురం రూరల్: మండలంలో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనుల సరళిని రాష్ట్ర ఉపాధిహామీ పథకం కౌన్సిల్ మెంబర్ అల్లు లావణ్య కుమార్, ఏపీఓ కృష్ణారావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు పెదబొండపల్లిలో జరుగుతున్న వ్యవసాయ నీటి కుంటలు, ప్రహరీ పనులు, గోశాలలను తనిఖీ చేశారు. మండలంలో ఉపాధి పనులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న నేపథ్యంలో వాటి నిర్వహణ, నాణ్యతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో జరుగుతున్న పనులు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో అసంపూర్తిగా ఉన్న పక్కాగృహాలను లబ్ధిదారులు వేగవంతం పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు నిడగల్లు జగనన్న కాలనీలో ఇళ్లనిర్మాణాలను మంగళవారం ఆయన హౌసింగ్ ఏఈ జానకీరాంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పెద్దలంతా కలిసి అసంపూర్తిగా నిలిచిపోయిన పక్కాగృహాలు పూర్తి చేయడానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ తోడబండి సూర్యనారాయణ, సర్పంచ్ రాయిపిల్లి ఆరుద్రమ్మ, గ్రామపెద్దలు, జి.శ్రీనివాసరావు, జి.తాతబాబు, ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నీలాటి రేవుకు మోక్షం



నూతనంగా ఏర్పాటు చేసిన రహదారిని పరిశీలిస్తున్న రంగునాయుడు

మక్కువ: స్థానిక సువర్ణముఖి నది నుంచి తాగునీరు తెచ్చేందుకు గతంలో మహిళలు రహదారి సౌకర్యం సక్రమంగా లేక తీవ్ర అవస్థలు పడేవారు. వర్షాకాలం వస్తే మహిళల బాధలు వర్ణనాతీతం. సమగ్ర రక్షిత మంచినీటి పథకం కొన్నిసార్లు మరమ్మతులకు గురైతే సువర్ణముఖి నది చెలమనీరే స్థానిక ప్రజలకు ఆధారం. మహిళలు సంబంధిత విషయాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు దృష్టికి తీసుకు వెళ్లడంతో మంగళవారం ఆయన జేసీబీతో మరమ్మతులు నిర్వహించి, రహదారి ఏర్పాటు చేయడంతో తాగునీరు తీసుకువచ్చే మహిళలకు అవస్థలు తీరనున్నాయి.

దాడిచేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదుచేయాలి

- ఆదివాసీ, గిరిజన సంఘాల డిమాండ్

సాలూరు: మండలంలోని తోణాం పంచాయతీలో గిరిజనులపై దాడిచేసి, దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు వంతల సుందరరావు, గిరిజన సంఘాల జేఏసీ నాయకులు కొండగొర్రి ఉదయ్‌కుమార్, పుష్పారావు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత గిరిజన కుటుంబంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తోణాం పంచాయతీ మద్దివలస గ్రామానికి చెందిన గిరిజనుడు కూనేటి లక్ష్మణరావు, ఆయన కుటుంబసభ్యులపై అదే గ్రామానికి చెందిన వీరమల్లు నాగేశ్వరరావు, మోహనరావు,ఓరుగంటి మస్తాన్‌రావు, కొండలరావు, సీహెచ్ శ్రీనివాసరావు, వారి కుటుంబసభ్యులు దాడిచేసి గాయపరచడంతో పాటు కులం పేరుతో దూషించి బెదిరించడం సరికాద న్నారు. గిరిజనులపై దాడి చేసి కులం పేరుతో దూషించిన వారందరిపై సమగ్రదర్యాప్తు నిర్వహించి అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్‌చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల జేఏసీ నాయకులు జయసింహ, గెమ్మెల బాబయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

దాడి చేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదు

సాలూరు రూరల్: మండలంలోని తోణాం పంచాయతీ మద్దిన వలస గ్రామంలో కూనేటి లక్ష్మణరావు గిరిజన కుటుంబంపై గిరిజనేతరులు ఈ నెల 15 వ తేదీన దాడి చేసిన కేసులో మంగళవారం 13 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఈ నెల 15న పొలం గట్టు దొడవలో కూనేటి లక్ష్మణరావు, ఆయన భార్య ఝాన్సీలపై దాడి చేసి దూషించినట్లు కమ్మ కులానికి చెందిన వీరల్ల నాగేశ్వరరావు, వి.మోహన రావు, ఓరుగంటి మస్తాన్‌రావు ఆయన భార్య, ఓరుగంటి కొండలరావు అతని భార్య, ఎస్ శ్రీనివాసరావు అతని భార్య, ఓరుగంటి నాయుడు అతని భార్య, ఓరుగంటి రత్తమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఎనిమిదవ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు చదురుగుడి, వనంగుడికి చేరుకోవడంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఈవో వీవీ సూర్యనారాయణ, ఎస్సై ఎం.వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు దగ్గరుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. గోముఖి నది తీరాన భక్తులు అమ్మవారికి కోళ్లను చెల్లించుకున్నారు. అనంతరం వనంగుడిలోని పోలమాంబ అమ్మవారిని దర్శించుకుని ఆలయం వెనుకన వేపచెట్టుకు పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటలు చేసుకుని భోజనాలు ఆరగించారు.



శంబర పోలమాంబ

జీడి పంటకు మద్దతు ధర కల్పించాలి

బలిజిపేట: జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ బలిజిపేట తహసీల్దార్ రత్నకుమారికి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మన్మథరావు, సత్యనారాయణ మాట్లాడుతూ కిలో జీడికి రూ.200 మద్దతు ధర కల్పించి 80కిలోల బస్తా రూ.16,000కు తీసుకోవాలని కోరారు. బలిజిపేట మండలంలోని నారాయణపురం, గౌరీపురం, పెద్దింపేట, అరసాడ, పదమాయవలస, మిర్తివలస, పెదపెంకి, భైరిపురం గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో జీడిపంటను పండిస్తున్నారని రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బి.భానుమూర్తి, ఆర్.సూరి, మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతులు

స్టాఫ్‌నర్సులకు శిక్షణా సర్టిఫికెట్ల అందజేత

పార్వతీపురంటౌన్: పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు మెరుగుపడేందుకు శిక్షణ సద్వినియోగం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. సాధారణ ప్రసవాలపై రీఓరియంటేషన్ శిక్షణ పూర్తి చేసుకున్న స్టాఫ్ నర్సులకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. బ్యాచ్‌ల వారీగా పీహెచ్‌సీ స్టాఫ్‌నర్సులకు నిర్దేశించిన ఏఎస్పీపీ శిక్షణ కార్యక్రమంలో మొదటి బ్యాచ్‌కు గత నెల 24న ప్రారంభించి ఈ నెల 18 వరకు జిల్లా ఆస్పత్రిలో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. సూపరింటెండెంట్ పర్యవేక్షణలో గైనకాలజిస్టులు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డాక్టర్ వినోద్, డీపీఎస్‌ఓ ఉషారాణి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కర రావు

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు

సీతానగరం: ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు తీవ్రరూపం దాల్చడం వల్ల వ్యవసాయ పనులు, ఉద్యోగాలు, విధులకు వెళ్తున్న సమయంలో వడదెబ్బకు గురికాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉష అన్నారు. ఈ మేరకు గ్రామాల్లోని ప్రజలనుచైతన్య పర్చడానికి స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.ఉష మాట్లాడుతూ వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్తున్న వారు ఎండకు గురికాకుండా ఉండేందుకు తలపై తెల్లని వస్త్రం, పాదాలకు చెప్పులు ధరించి విధుల్లోకి వెళ్లాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు నిమ్మరసం లేదా కొబ్బరి నీరు తాగాలని చెప్పారు. ఎండ కారణంగా ఎటువంటి సమస్య వచ్చినా తక్షణమే స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీరమణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, వెల్‌నెస్ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పి.ఉష

అంగన్వాడీ హెల్పర్స్‌కు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న ఐటీడీఏ పీఓ అశోతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: పీఎం జన్‌మన్ అంగన్వాడీ హెలర్స్ ఇంటర్వ్యూలను మంగళవారం తన కార్యాలయంలో ఐటీడీఏ పీఓ, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ నిర్వహించారు. మొత్తం 8 పోస్టులకుగాను 13మంది అభ్యర్థులు హాజరు కాగా ఒక్కొక్కరిని పిలిచి ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూ ప్యానల్‌లో పీఓతోపాటు ఐసీడీఎస్ పీడీ డా.టి. కనకదుర్గ, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, సీడీపీఓ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి సాధించాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలో చేపడుతున్న పనుల్లో పురోగతి ఉండాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన కార్యాలయంలో గిరిజన సంక్షేమశాఖ ఇంజినీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో బహుళ వినియోగ కేంద్రాలు, మినీ గోకులాలు, హాత్‌బజార్, ఉపాధిహామీ పనులు, పీఎం జన్‌మన్, సీసీడీపీ, నాబార్డ్, ఎస్‌హెచ్‌ఎం, ఆర్టికల్ 275(1) గ్రాంట్ పనులు మరింత వేగవంతం చేయాలని కోరారు. ప్రతి వారం పనుల్లో పురోగతి ఉండేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుని పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఈఈ మణిరాజ్, ఇతర ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైరల్ హెపటైటిస్‌తో అప్రమత్తం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: వైరల్ హెపటైటిస్‌తో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కరరావు సూచించారు. ఈ మేరకు కాలేయ వ్యాధి నియంత్రణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైరస్ ద్వారా సోకే కాలేయ వ్యాధికి కారణం ఐదు రకాల వైరస్‌లని అవి హెపటైటిస్ ఏబీసీడీఈలని వాటిలో హెపటైటిస్ బి ముఖ్యమైనదన్నారు. రోగ లక్షణాలు, నిర్ధారణ పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చని చెప్పారు. వైరల్ హెపటైటిస్ సోకిన వారిలో శరీరం త్వరగా అలిసిపోవడం, కడుపునొప్పిగా ఉండడం, ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు, చర్మం, కళ్లు, పసుపురంగులో మారుతాయన్నారు. శుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవడం, వ్యాధిగ్రస్తులు వాడిన బ్లేడ్లు, సూదులు వంటివి వాడకూడదని సూచించారు. నిర్ధారణ పరీక్షలతో వ్యాధిని గుర్తించవచ్చని తద్వారా తగిన చికిత్స, నివారణచర్యలు చేపట్టడం ద్వారా అరికట్టవచ్చని తెలిపారు. గర్భిణులందరికీ హెపటైటిస్ బి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని, అలాగే పుట్టిన వెంటనే పిల్లలకు హెపటైటిస్‌బి టీకా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, డాక్టర్ వినోద్ కుమార్, డీపీహెచ్‌ఎన్ ఉషారాణి, డీపీఓ లీలా, డెమో సన్యాసిరావు, డీఎస్‌ఓ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

అధ్వానంగా రోడ్డు

పార్వతీపురం రూరల్: మండలంలో రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు రోడ్ల నిర్మాణం దిశగా కృషి చేయాల్సిన పాలకులు, సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి దృష్టిసారించాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు. వెంకంపేట గోరీల నుంచి మండలంలోకి వెళ్లేందుకు ఉన్న రహదారి రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో కొంతదూరం వెళ్తేనే ఒళ్లు హూనమవుతుంది. ఆదమరిచి అదుపుతప్పితే కిందపడి గాయాలపాలయ్యే ప్రమాదం ఉంది. ఇక గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లాలంటే ఏ క్షణం ఏమవుతుందోనని భయపడాల్సిందే. రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలపై హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఎప్పుడు పనులు ప్రారంభిస్తుందోనని ప్రయాణికులు, వాహన చోదకులు ఎదురు చూస్తున్నారు.



రాళ్లు తేలి ప్రమాదకరంగా ఉన్న వెంకంపేట రహదారి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన ఘన, జీవామృతం తయారీపై అవగాహన కల్పించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని గుచ్చిమి పంచాయతీ తాన్న సీతారాంపురంలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో భాగంగా ఘన, జీవామృతం తయారీపై రైతులకు శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఏఓ అవినాష్ మాట్లాడుతూ మండలంలోని రైతులు వ్యవసాయం చేయడానికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు వ్యవసాయ సహాయకులకు దరఖాస్తులు సమర్పించాల్సి ఉందన్నారు. వచ్చిన అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీసీఎస్‌ఎఫ్ రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

పార్వతీపురం రూరల్: సారాలేని గ్రామాలుగా ప్రతి పల్లెను తీర్చిదిద్దాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, ఏఈఎస్ జీవన్ కిశోర్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పెదబొండపల్లిలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామస్తులకు సారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ప్రజలకు సారా వల్ల కలిగే అనర్థాలను తెలిపి అలాగే సారా తయారీ, తరలించే, విక్రయించే వారిపై తీసుకున్న చర్యలు ఏ విధంగా ఉంటాయో స్పష్టం చేశారు. రెండోసారి పట్టుబడితే కోర్టులో హాజరుపరచడంతో పాటు వారిపై రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్, ఎస్సైలు యు.నాగేశ్వరరావు, రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఈఎస్ జీవన్‌కిశోర్

పేదవిద్యార్థులకు అందుబాటులో సాంకేతిక విద్య

- పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తుకు ఆఖరు తేదీ ఏప్రిల్ 15

పార్వతీపురం రూరల్: గ్రామీణ, పేద పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి వచ్చింది. ఇందుకు పాలిసెట్– 2025 ప్రభుత్వం నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసింది. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి పార్వతీపురం మండలంలోని ఎమ్మార్‌నగరంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు లభిస్తాయి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, సాంకేతక నిపుణులు సూచిస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉపయోగం

గ్రామీణ, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సాంకేతిక చదువులను చదువుకోవాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. వారికి తక్కువ వ్యయంతో ప్రాథమికంగా సాంకేతిక విద్యను అందించేందుకు ప్రభుత్వం పాలిటెక్నిక్ కోర్సులను అందుబాటులోకి తెచ్చింది. ఈ కోర్సులతో స్వయం ఉపాధితోపాటు ఉద్యోగావకాశాలు కూడా పొందేందుకు అవకాశం ఉంటుంది. పాలిసెట్– 2025 కోసం దరఖాస్తుల స్వీకరణకూడా ప్రారంభించారు. ఏప్రిల్ 15వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.



ఎమ్మార్‌నగరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల

ఎమ్మార్‌నగరంలో..

జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎమ్మార్‌నగరంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఈఈఈ), కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులకు సంబంధించి ఒక్కో కోర్సుకు 66 సీట్లు చొప్పున రెండు కోర్సులకు మొత్తంగా 132 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సుల కాలవ్యవధి మూడు సంవత్సరాలు, ఇందులో ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు.

పాలిసెట్ ఇలా...

పాలిసెట్‌ను 120 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. పదోతరగతి సిలబస్ ఆధారంగా ప్రవేశపరీక్ష ఉంటుంది. ఈ ఏడాది ఎప్రిల్ 30న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించనున్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



అన్ని వసతులు ఉన్న ఎమ్మార్‌నగరం పాలిటెక్నికల్ కళాశాల, విద్యార్థులకు అనువైన ప్రాంతంలో ప్రశాంతకరమైన వాతావరణంలో ఉన్నందున విద్యార్థులకు నైపుణ్య కోర్సులపై మెరుగైన శిక్షణ ఇవ్వనున్నాం. పదోతరగతి తరువాత విద్యార్థులు పాలిటెక్నిక్ చేస్తే చిన్న వయస్సులోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధికి తోడ్పడుతుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– విలియం క్యారీ, ప్రిన్సిపాల్ , ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎమ్మార్‌నగరం

అమ్మాదేవి కొండవద్ద ఏనుగులజోన్ వద్దు

సీతానగరం: మండలంలోని జోగింపేట సమీపంలో ఉన్న అమ్మాదేవి కొండపై ఏనుగుల జోన్ పెట్టవద్దని కోరుతూ జరుగుతున్న పనులను సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పలుగ్రామాలరైతులు అడ్డుకుని పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని జోగింపేట, గుచ్చిమి, తాన్న సీతారాంపురం, గులిగుమ్మి, గదబవలస, రేపటివలస, అప్పయ్యపేట గ్రామాలను ఆనుకుని ఉన్న అమ్మాదేవి కొండచుట్టూ జేసీబీలతో కందకాల పనులు జరుగుతున్నాయని గుర్తించిన ప్రజలు మంగళవారం అక్కడికి వెళ్లి పనులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు, సీపీఎం మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, జీవీ రమణ, రెడ్డి రమణమూర్తి, పలుగ్రామాల రైతులు పాల్గొన్నారు.



అమ్మాదేవి కొండ దగ్గర పనులను అడ్డుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు